సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



దళితబంధుతో ఆర్థిక వెలుగులు
దళితబంధు పథకం ఆర్థిక వెలుగులు నింపుతుందని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. - 10లో



నిర్మాణంలో జాప్యం..
మోత్కూరు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు ఏడాది గడిచినా పూర్తి కావడం లేదు. - 11లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38°/24°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

23 నుంచి కరాటేలో ఉచిత శిక్షణ

భువనగిరి టౌన్ : దుంపల మల్లారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరాటే, పాటల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, ఎండీ జహంగీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరాటేతో పిల్లల్లో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు.ఆసక్తి కలిగిన వారు ఈనెల 20వ తేదీ నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని, 23నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం మొబైల్ నంబర్లు 9603162544, 9951238203ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహ గాయత్రి హవనం



యజ్ఞం నిర్వహిస్తున్న స్వామీజీలు

యాదగిరిగుట్ట : పట్టణంలోని శుభోదయ గార్డెన్స్‌లో అఖండనామ ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో భారత సైన్య సంరక్షణ కోసం, శాంతి భద్రతలు, విశ్వశాంతి, పాడి పంటలు, ప్రజలు మంచిగా ఉండాలని నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహా యజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. 12వ రోజు శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహ గాయత్రి హవనం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు హోమాది పూజలు చేపట్టారు. వేకువ జామునే యాదాద్రి పుణ్యక్షేత్రం చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. ఈ వేడుకల్లో సీఎస్ బ్రదర్స్ ప్రతినిధి పాశికంటి మల్లేశం, వీరధర్మజా స్వామిజీ, మాతా నిరంజన, మాతా మధుమంజని దేవి, వెంకటేశ్వర ఆనందస్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

59 మంది అనర్హులుగా గుర్తింపు



భువనగిరిలోని సింగన్నగూడెం వద్ద లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లు

భువనగిరిటౌన్ : భువనగిరిలో డబుల్ బెడ్ రూం ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో 59 మంది అనర్హులు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ ఇళ్లను త్వరలో లక్కీ డ్రా ద్వారా కేటాయించనున్నారు. వివరాలిలా.. భువనగిరిలోని సింగన్నగూడెం వద్ద 444 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ఇందులో డ్రా ద్వారా 417 ఇళ్లను కేటాయించారు. మరో 27 గృహాలను స్టాండ్ బైలో ఉంచారు. అయితే ఇళ్ల పంపిణీ పారదర్శకంగా జరగలేదని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దరఖాస్తుదారులు, అఖిలపక్ష నాయకులు పలుమార్లు ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ఇళ్లురాని వారు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు నలుగురు తహసీల్దార్లు, 12 మంది ఆర్‌ఐలు మరోసారి విచారణ చేపట్టారు. లబ్ధిదారుల్లో 59 మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 8న అనర్హుల జాబితా ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఎస్సీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సీహెచ్ సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి అర్హతపై జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఫార్మసీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులకు అర్హులు అవుతారని, వీరికి మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, అడ్వాన్స్‌డ్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుకు ఇంటర్మీడియేట్ చదువుకున్న వారు అర్హులని.. వీరికి 12 నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 13వ తేదీలోగా పట్టణంలోని రెడ్డికాలనీలో గల పాత బ్రిలియంట్ స్కూల్ సమీపంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9848581100, 7981789044, 9059902355 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు ఎయిమ్స్‌కు శంకుస్థాపన



ఎయిమ్స్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ భవన నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. వర్చువల్‌గా చేసే ఈ కార్యక్రమానికి బీబీనగర్ ఎయిమ్స్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎయిమ్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ పై మోదీ శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని చూసే విధంగా ఎల్‌ఈడీలు ఏర్పాటు చేశారు. 12 గంటల నుంచి 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ బాటియాతోపాటు 20 మంది ఎయిమ్స్ డాక్టర్లకు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమానికి అనుమతి ఇచ్చారు.

వందే భారత్ రాక నేడే..



నల్లగొండ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన షామియానాలు, ప్రధాని మోదీ ఫ్లెక్సీలు

నల్లగొండ రూరల్ : వందే భారత్ రైల్ శనివారం జిల్లా మీదుగా పరుగులు పెట్టనుంది. ఇందుకు రైల్వే అధికారులు నల్లగొండ రైల్వే స్టేషన్‌లో స్వాగత ఏర్పాట్లు చేశారు. దాదాపు మూడు వేల మంది నల్లగొండ రైల్వే స్టేషన్‌కు వచ్చి వందే భారత్ రైల్‌కు స్వాగతం పలకనున్నారు. ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ ప్రారంభించిన తర్వాత రైలు నల్లగొండ రైల్వే స్టేషన్ మీదుగా తిరుపతికి వెళ్లనుంది. మొదటి రోజు కేంద్రీయ విద్యాలయానికి చెందిన 60 మంది విద్యార్థులను గుంటూరు వరకు తీసుకెళ్లనున్నారు. మొదటిరోజు అన్ని రైల్వే స్టేషన్లలో స్వాగతం పలికేందుకు నిలుపనున్నారు. సికింద్రాబాద్ నుంచి బీబీనగర్, చిట్యాల, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడ మీదుగా తిరుపతికి చేరుకుంటుంది.

కూలి రూ.120 లోపే!

ఉపాధిహామీ కూలీల శ్రమకు దక్కని ఫలితం
- కూలి గిట్టుబాటుకాక పనులపై అనాసక్తి
- పని చేసే చోట సౌకర్యాలూ కరువే
- రోజురోజుకూ తగ్గుతున్న కూలీల సంఖ్య
- 2,57,900 మందికి 20వేల మంది మాత్రమే హాజరు



భువనగిరి మండలం అనాజిపురంలో ఎండలో పని చేస్తున్న కూలీలు

సాక్షి,యాదాద్రి : ఉపాధిహామీ కూలీలకు శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. మండుటెండలో కష్టపడుతున్నా కనీస వేతనంలో సగం కూడా చేతికొస్తలేదు. ప్రభుత్వం చెబుతున్నది రూ.257 కాగా తమకు గిట్టుబాటు అవుతున్నది రూ.120లోపేనని కూలీలు వాపోతున్నారు. పైగా గతంలో ఇచ్చిన వేసవి అలవెన్స్ కూడా నిలిపివేశారు. పని చేసే చోట సౌకర్యాలూ కల్పించడం లేదు. వెరసి గ్రామాల్లో చాలామంది కూలీలు పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా 2,57,900 మంది జాబ్‌కార్డు కలిగి ఉన్నప్పటికీ కేవలం 20,000ల మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న పనులు
ఉపాధిహామీలో భాగంగా ప్రస్తుతం మట్టి రోడ్ల ఫార్మెషన్, చేపల కుంటలు, ఫిష్ పాండ్లు, నీటి గుంతలు తీయడం, నర్సరీల పెంపకం, రైతుల పొలాల్లో మట్టికట్టలు పోయడం, చెట్లను తొలగించడం వంటి పనులు జరుగుతున్నాయి. ఆయా పనుల్లో శుక్రవారం 20వేల మంది కూలీలు పాల్గొన్నారు.

రూ.80 నుంచి రూ.120
కూలీలు కొలతల ప్రకారం పని చేయాలి. మండుటెండలో కష్టపడుతున్నా గిట్టుబాటు కావడం లేదు. రోజూ రూ.80 నుంచి రూ.120 దాటడం లేదని కూలీలు చెబుతున్నారు. అంతేకాకుండా గతంలో వేసవి అలవెన్స్ కింద రోజు వేతానికి అదనంగా ఫిబ్రవరిలో రూ.20, మార్చిలో రూ.25, ఏప్రిల్, మే మాసాల్లో రూ.30, జూన్‌లో రూ.20 కలిపి చెల్లించేవారు. గడ్డపారలు, పారలకు మొనలు పెట్టించడానికి అయ్యే ఖర్చులు ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం అలవెన్స్‌లు తొలగించారు. దీంతో జిల్లాలో వేలాది మంది కూలీలు పనికి దూరమయ్యారు. ఇదిలా ఉండగా కూలీలకు ఈనెల నుంచి రూ.14 పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.వీటితో కలిపి కనీస వేతనం రూ.271 పెరగనుంది. అయినా తమకు పెద్దగా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం కూలీల్లో వ్యక్తమవుతోంది.

వసతుల లేమి.. ఉపాధిహామీ పనులు చేసే ప్రాంతాల్లో కూలీలు సేద దీరడానికి టెంట్లు ఏర్పాటు చేయాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. కానీ, ఎక్కడా కనిపించడం లేదు. కూలీలు ఇళ్ల వద్ద నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు. చెట్ల నీడన సేద దీరుతున్నారు.

సాంకేతిక సమస్యలు
కూలీలు పని చేసే చోటు నుంచి ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం)లో అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం కూలీలకు తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. నెటవర్క్ సరిగా లేకపోతే అటెండెన్స్ నమోదు కావడంలేదు. దీంతో కూలీలు పనిచేసినా ఆ రోజు కోల్పోతున్నారు. ఒక్కొక్కరికి పనిదినాలు 50 రోజులు కూడా దాటడం లేదని కూలీలు చెబుతున్నారు. అంతేకాకుండా సాంకేతిక సమస్యల కారణంగా కొందరి ఆధార్ నంబర్లు ఇతర కూలీల బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడేనికి చెందిన కొండమడుగు నర్సయ్య వారం రోజులు ఉపాధి పనులకు వెళ్లాడు. అయినా అతని ఖాతాలో డబ్బులు జమ కాలేదని వాపోయాడు.

గిట్టుబాటు అయితలేదు



“ఉపాధి పనులకు వెళ్తే రూ.150 కూడా గిట్టుబాటు అయితలేవు. గతంలో పని కోసం దూరం వెళ్తే కిరాయి, గడ్డపార, పార మొన పెట్టించేందుకు, మంచి నీటి కోసం అలవెన్సులు ఇచ్చేవారు. ఇప్పుడు ఇస్తలేరు. కనీస వేతనం రూ.271 పెంచినట్లు అధికారులు చెబుతున్నా చేతికందలేదు.
–వాణి, ఉపాధిహామీ కూలీ, అనాజిపురం

పని దినాలు పెంచాలి



“ఉపాధి కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రోజూ రూ.80 కూడా గిట్టుబాటు కావడం లేదు. 50 రోజులకు మించి పని దొరకడం లేదు.పనిదినాలు పెంచాలి. పని చేసే చోట వసతులు లేవు. వడదెబ్బ మృతులకు పరిహారం ఇవ్వలేదు.
–కొండమడుగు నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

ఏపూరుకు జాతీయ అవార్డు

- మహిళా స్నేహపూర్వక పంచాయతీ విభాగంలో ఎంపిక
- 24న రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్న సర్పంచ్



మహిళల ఆర్థిక పరిపుష్టికి బాటలు

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలంలోని ఏపూరు గ్రామ పంచాయతీ మహిళా స్నేహపూర్వక విభాగంలో జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌కు రాష్ట్రం నుంచి వివిధ అంశాల్లో 8 పంచాయతీలు ఎంపికవగా అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఏపూరు ఒక్కటే అవార్డుకు ఎంపికవడం విశేషం. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న సూర్యాపేట నియోజకవర్గంలో ఉండి, మంత్రి దత్తత గ్రామమైన ఏపూరు ఇప్పటికే మహిళా స్నేహపూర్వక పంచాయతీగా రాష్ట్ర స్థాయిలో పురస్కారం అందుకుంది. తాజాగా జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది.

గ్రామంలో 958 సభ్యులతో 93 స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకున్నాయి. రూ.3 కోట్లతో మినీ డెయిరీ, మిల్క్ సెంటర్లు, వివిధ రకాల పిండి మరలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక పరిపుష్టికి బాటలు వేసుకున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ఆత్మరక్షకోసం శిక్షణ ఇస్తున్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వంద శాతం వ్యాక్సినేషన్, పోషకాహారం అందించడంలో పంచాయతీ సత్ఫలితాలు సాధించింది. ఈ నెల 24న పంచాయతీరాజ్ దివస్ రోజున ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా సర్పంచ్ సానబోయిన రజిత అవార్డు అందుకోనున్నారు.

బండి సంజయ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాములు, జహంగీర్



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్, చిత్రంలో గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : పదవ తరగతి పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీతో సంబంధం ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాములు, ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే సీపీఐ, సీపీఎం ఉమ్మడి రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శ వర్గసభ్యులు మంగ నర్సింహులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బబ్బూరి పోశెట్టి, పేరబోయిన మహేందర్, బబ్బూరి శ్రీధర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి



మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న మాధవరెడ్డి

చౌటుప్పల్ : భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం (బీఆర్ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడిగా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన డిల్లీ మాధవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీఆర్ఎస్‌టీయూ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన అధ్యక్షుడిగా నియమితులైన మాధవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మిక విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని మంత్రి సూచించినట్లు మాధవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌టీయూ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, నాయకులు డిల్లీ శంకర్ రెడ్డి, ఆకుల శ్రీకాంత్, సుర్కంటి రాంరెడ్డి, తొర్పునూరి మల్లేష్, యాదయ్య, ఆనంద్, శంకరయ్య, చలమందరాజు, రాజు, శ్రీధర్‌రెడ్డి, యోగానందం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



గుడ్‌ఫ్రైడే సందర్భంగా భువనగిరి మండలం జమ్మాపురం స్టేజీ వద్ద ఏసు శిలువకు ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ప్రయాణికులకు పరీక్ష!

ఆలేరు నియోజకవర్గ రహదారులపై నరకయాతన
- ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ఆత్మకూర్(ఎం) – రాయగిరి రోడ్డు
- యాదగిరిగుట్ట నుంచి రాజాపేట రోడ్డుకు నిధులున్నా పెండింగ్
- గుండాల – రామారం మార్గం గుంతలమయం
- ప్రమాదాల బారిన వాహనదారులు



గుంతలమయంగా యాదగిరిగుట్ట - దాతరుపల్లి రహదారి



తుర్కపల్లి మండలం మల్కాపూర్ నుంచి లక్ష్మాపూర్‌కు వెళ్లే రోడ్డు ఇలా..

యాదగిరిగుట్ట : ఆలేరు నియోజకవర్గ రోడ్లంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారులు కంకర తేలి, గోతులు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. రాత్రి వేళల్లో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా.. ప్రాణాలే పోయే ప్రమాదం ఉంది. కొన్ని రోడ్ల పనులను ప్రారంభించి ఏళ్ల గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. మరికొన్ని నిధుల లేమితో మరమ్మతులకు నోచుకోవడం లేదు.

- ఆత్మకూరు (ఎం) మండలం పోసానికుంట నుంచి మోటకొండూర్ మండలం కాటేపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరి చేసింది. పోసానికుంట నుంచి రాయిపల్లి వరకు పనులు పూర్తయ్యాయి. రాయిపల్లి నుంచి కాటేపల్లి వరకు రోడ్డు ఒక వైపు పూర్తి కాగా మరో వైపు పెండింగ్‌లో ఉంది. మూడేళ్లుగా పనులు కొనసాగుతున్నాయి.
- యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లి నుంచి పెద్దకందుకూరుకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. దాతారుపల్లి నుంచి యాదగిరిగుట్ట రోడ్డుపైనా అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఇక యాదగిరిగుట్ట మండలం కాచారం పరిధిలోని కుమ్మరిగూడెం, యాసోజీగూడెం రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బీటీగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల క్రితం రూ.2.89కోట్లు మంజూరు చేసినా పనులు మొదలు కాలేదు.
- తుర్కపల్లి మండలంలోని మల్కాపూర్ నుంచి చిన్నలక్ష్మాపూర్ వరకు రోడ్డు ప్రయాణానికి వీల్లేకుండా ఉంది. ఇదే మార్గంలో ముల్కలపల్లి నుంచి గొల్లగూడెం వరకు మట్టిరోడ్డు కావడంతో చిన్నపాటి వర్షానికే గుంతలమయం అవుతుంది. ఇక దయ్యంబండ నుంచి కోనాపూర్ వెళ్లే రోడ్డు రాత్రి సమయంలో వెళ్లలేని విధంగా ఉంది.
- ఆలేరు నుంచి వయా మంతపురి, బహదూర్‌పేట, ఇక్కుర్తి, శర్బనాపురం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆలేరు నుంచి మంతపురి వరకు 3 కిలో మీటర్లు బీటీ మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా పనులు కార్యరూపం దాల్చలేదు. ఇక కొలనుపాక నుంచి రాఘవాపురం రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది.
- మోటకొండూర్ మండలం వర్టూర్ నుంచి మాటూరు రోడ్డు నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు.

20 కిలో మీటర్ల మేర అధ్వానం



గుండాల మండలం రామారం నుంచి కొమ్మాయిపల్లి వరకు సుమారు 20 కి.మీ వరకు బీటీ రోడ్డు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. గుండాల నుంచి గంగాపురం మీదుగా సూర్యాపేట, జనగాం హైవే వరకు రోడ్డంతా అధ్వానంగా మారింది. ఏడు కిలో మీటర్ల దూరం అర్ధగంట సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.ఇక బండకొత్తపల్లి నుంచి దేవరుప్పల వరకు 5 కి. మీ మేర గుంతలు ఏర్పడ్డాయి

రోడ్డంతా కంకర తేలింది



“గంగాపురం బీటీ రోడ్డు కంకర తేలి గుంతలుగా మారింది. వర్షాలు పడినప్పుడు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కార్ల టైర్లు సైతం గుంతల్లో ఇరుక్కుపోయి చాంబర్లు పగిలిపోతున్నాయి. 7 కిలోమీటర్లు అర్ధగంట ప్రయాణం చేయాల్సి వస్తుంది. రోడ్డును ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.
–దూదిగాను నాగరాజు, గంగాపురం, గుండాల మండలం

ప్రమాదాలు జరుగుతున్నాయి



“యాదగిరిగుట్ట నుంచి దాతారుపల్లి వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయంగా మారింది. ఈ మార్గంలో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులకు గురవుతున్నాం. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో నీరు నిలిచి గుంతలు కనిపించవు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.
–నల్లమాస అజయ్, దాతరుపల్లి, యాదగిరిగుట్ట మండలం

టెండర్లు పిలిచారు.. పనులు ప్రారంభిస్తలేరు



“రాజాపేట మండలం నుంచి యాదగిరిగుట్ట వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాజాపేట నుంచి గుట్టకు చేరుకోవడానికి 30 నిమిషాలకు బదులు గంటకు పైగా సమయం పడుతుంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్ల నుంచి మరమ్మతులు లేవు. నిధులు కేటాయించి, టెండర్లు పిలిచినప్పటికీ పనులు మాత్రం ప్రారంభించడం లేదు.
–ఎం.రాజు, నమిలె, రాజాపేట మండలం

రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు



యాదాద్రి పుణ్యక్షేత్రం నుంచి సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయం వరకు 28.5 కిలో మీటర్ల మేర ఉన్న డబుల్ రోడ్డుపై 20 కి.మీ పరిధిలో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులకోసం ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం రూ.5 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు కూడా పూర్తయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆ తర్వాత ముందుకు రావడం లేదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు 30 నిమిషాల ప్రయాణం గంటన్నర పడుతుందని వాహనదారులు అంటున్నారు. వర్షాలు కురిస్తే నడవలేని విధంగా రోడ్డు తయారవుతుంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



గాయపడిన శ్రీనివాస్‌కు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

అర్వపల్లి: నకిరేకల్–తానంచర్ల 365 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం కలాన్‌మాదారం గ్రామానికి చెందిన గుమ్మడవెల్లి శ్రీనివాస్ తన సతీమణి రజినీతో కలిసి బైక్‌పై అర్వపల్లికి వస్తుండగా జాజిరెడ్డిగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న శ్రీనివాస్‌కు తీవ్ర, రజినీకి స్వల్పగాయాలయ్యాయి. వారికి 108 సిబ్బంది ప్రాథమికంగా చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీనివాస్‌ను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు.

పోతిరెడ్డిపల్లిలో గీత కార్మికుడికి..

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం)మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి కోల భిక్షం గౌడ్ కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా శుక్రవారం గ్రామ శివారులో తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు తొలుత భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ గనగాని మాధవి మల్లేశం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

రేషన్ బియ్యం పక్కదారి.. పట్టిస్తున్నాడని..

- డీలర్‌తో వాగ్వాదానికి దిగిన బేతవోలు గ్రామస్తులు

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో గల రేషన్‌షాపులో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు గ్రామస్తులు శుక్రవారం రేషన్ డీలర్‌ను నిలదీశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని వెంకయ్యకు చెందిన రేషన్ దుకాణానికి ప్రతినెలా సరఫరా అయ్యే రేషన్‌బియ్యంలో కొంత సన్నబియ్యం కూడా వస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల కూడా కొంత సన్నబియ్యం వచ్చాయి. శుక్రవారం సాయంత్రం బియ్యం పంపిణీ చేస్తుండగా పలువురు గ్రామస్తులు అక్కడకు చేరుకుని గత నెలలో వచ్చిన సన్నబియ్యం ఎవరికి పంపిణీ చేశావని ప్రశ్నించారు. బియాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నావని గ్రామానికి చెందిన గురుస్వామి వెంకయ్యను నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రేషన్ షాపుకు వచ్చిన బియ్యంలో 30 బస్తాలకు పైగా తక్కువ ఉన్నట్లుగా గ్రామస్తులు తెలుసుకున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ రాజేశ్వరికి ఫిర్యాదు చేశారు.

ఒకరిని బలిగొన్న మద్యం మత్తు





చిలుకూరు : రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన క్షతగాత్రులు, నుజ్జునుజ్జయిన ఆటో

- ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆటో
- ఒకరి మృతి.. పలువురికి తీవ్ర గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- చిన్నారుల పుట్టువెంట్రుకలు తీయించేందుకు వెళ్తుండగా దుర్ఘటన

చిలుకూరు : ఆటో డ్రైవర్ మద్యం మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకోగా పలువురిని ఆస్పత్రి పాల్జేసింది. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. చిలుకూరు మండల పరిధిలో శుక్రవారం రాత్రి ధాన్యం ట్రాక్టర్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం రేగులగడ్డతండాకు చెందిన బాణోతు గాంధీ కుమారుడు, కుమార్తెల పుట్టువెంట్రుకలు తీయించేందుకు సాయంత్రం కుటుంబ సభ్యులు పది మందితో కలిసి ఆటోలో మహబూబాబాద్ జిల్లా కురవి క్షేత్రానికి బయలుదేరారు. కాగా, ఆటో డ్రైవర్ అప్పటికే మద్యం మత్తులో ఉండగా గాంధీ కుటుంబ సభ్యులు అతడిని బలవంతంగా లేపి తీసుకెళ్లారు. మార్గమధ్యలో చిలుకూరు మండలం బేతవోలు గ్రామ శివారులోని కాటమయ్య గుడి దగ్గరకు రాగానే ఎదురుగా ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆటో డ్రైవర్ బాణోతు వీరయ్య వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కనే కూర్చున్న బాణోతు వెంకు(55) అక్కడికక్కడే మృతిచెందగా అందులో ప్రయాణిస్తున్న బాణోతు సాగర్, బాణోతు నాగ, బాణోతు సక్కుబాయితో పాటు డ్రైవర్ బాణోతు వీరయ్య, బాణోతు రమాదేవి, బాణోతు అంజలి, బాణోతు గాంధీ, బాణోతు విశ్వతేజ్‌కు గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనంలో తొలుత హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న బాణోతు సాగర్, బాణోతు నాగ, బాణోతు సక్కుబాయి, బాణోతు వీరయ్యను సూర్యాపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్ తెలిపారు.



బాణోతు వెంకు(ఫైల్)

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్: క్షతగాత్రులకి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం చిలుకూరు మండలం బేతవోలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని హుజూర్‌నగర్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే పరామర్శించారు. క్షతగాత్రులకు అండగా ఉంటానని చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఆర్‌ఎంఓ డాక్టర్ రవికుమార్ తెలిపారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి మృత్యుఒడికి

- వ్యవసాయ బావిలో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి
- కేతేపల్లి మండలం గుడివాడలో విషాదం



అనిల్(ఫైల్)

కేతేపల్లి: ఈత నేర్చుకునేందుకు స్నేహితులతో కలసి వెళ్లిన ఓ ఇంటర్ విద్యార్థి ప్రమాదశవాత్తు వ్యవసాయ బావిలో మునిగి మృతిచెందాడు. కేతేపల్లి మండలం గుడివాడ గ్రామంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుడివాడ గ్రామానికి చెందిన కొడిదల శ్రీనివాస్ కుమారుడు అనిల్‌కుమార్(17) కొర్లపహాడ్‌లోని మోడల్ స్కూల్‌లో ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావటంతో ఈత నేర్చుకునేందుకు వారం రోజుల నుంచి స్నేహితులతో కలసి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా స్నేహితులతో కలసి అనిల్‌కుమార్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావిలో దిగి ఈత నేర్చుకుంటుండగా నీటిలో మునిగిపోకుండా నడుముకు కట్టుకున్న ఖాళీ ప్లాస్టిక్ సీసాల సంచీ ఊడిపోయింది. దీంతో అనిల్‌కుమార్ అందరూ చూస్తుండగానే నీటిలో మునిగిపోయాడు. వెంటనే ఒడ్డున ఉన్న స్నేహితులు కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి సమాచారం అందించారు. గ్రామస్తులతో కలసి కుటుంబ సభ్యులు బావి వద్దకు చేరుకుని అనిల్‌కుమార్‌ను బయటకి తీసినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు విగతజీవుడిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనిల్‌కుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని కేతేపల్లి పోలీసులు తెలిపారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో కార్మికుడు మృతి

- ఐరన్ చానల్ పైనుంచి కిందపడడంతో ప్రమాదం
- మరో కార్మికుడికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్(28), మనోజ్ పాశ్వాన్‌లు పవర్‌ప్లాంట్‌లో పవర్‌మెక్ సంస్థ కింద దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. ప్లాంట్ నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం బాయిలర్ ప్లాంట్ సమీపంలో బొగ్గు తరలించే కన్వేయర్ బెల్టు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. సుమారు 50 అడుగుల ఎత్తులో ఐరన్ చానల్‌పై బెల్టు బిగిస్తుండగా, అక్కడే పనులు చేస్తున్న రాజ్‌కుమార్(28), మనోజ్ పాశ్వాన్‌లు ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా మనోజ్‌పాశ్వాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని టీఎస్‌జెన్‌కో ఉన్నతాధికారులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.



ప్రమాద స్థలంలో గాయపడిన రాజ్‌కుమార్, మనోజ్‌పాశ్వాన్

కారు, బైక్ ఢీ.. ఒకరి దుర్మరణం

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలో శుక్రవారం బైక్, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని హరిజనాపురం గ్రామానికి చెందిన పల్లేటి కుమార్(34) మండల కేంద్రం నుంచి మాల్‌వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో పోలేపల్లి రాంనగర్ వనమైసమ్మ ఆలయం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు పల్లేటి కుమార్ బైక్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పల్లేటికుమార్ మృతదేహం

ఆయిల్‌పామ్ మొక్కలు, మోటార్ పైపులు ధ్వంసం

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 65, 82లలో గల సుమారు 45ఎకరాల ఆయిల్‌పామ్ తోటలోని మొక్కలు, మోటార్ పైపులైన్లు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మఠంపల్లి ఎస్‌ఐ ఇరుగు రవి వివరాల ప్రకారం.. మఠంపల్లికి చెందిన రైతు గోపు బాలరెడ్డి రఘునాథపాలెంలో తన 45ఎకరాల్లో డ్రిప్ సాయంతో మోటార్లు ఏర్పాటుచేసి ఆయిల్ పామ్ తోట సాగుచేశాడు. మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు తోటలోని మొక్కలు, మోటార్లు, పైపులైన్లు ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉద్యానవన అధికారి అనిత, డ్రిప్ అధికారులు రాజేందర్ రెడ్డి, సందీప్‌రెడ్డి తోటను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.



ధ్వంసమైన పైపులు పరిశీలిస్తున్న అధికారులు

ఆలయంలో హుండీ చోరీ

హుజూర్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో హుండీని చోరీ చేశారు. ఈ ఘటన హుజూర్‌నగర్‌లోని గోవిందాపురంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోవిందాపురంలోని ముత్యాలమ్మ ఆలయంలోకి గురువారం రాత్రి దుండగులు ప్రవేశించారు. ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లి తాళం తెరిచారు. అందులోని నగదును తీసుకుని హుండీని స్థానిక చెరువుకట్ట వద్ద పడవేసి వెళ్లిపోయారు. ఉదయం స్థానికులు హుండీని గమనించడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

పొలానికి వెళ్లిన రైతు అదృశ్యం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): పొలానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిన ఓ రైతు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన గొంగిరెడ్డి భిక్షారెడ్డి 4వ తేదీన మోటార్ సైకిల్‌పై వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అతని కుమార్తె స్వాతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్ర రంగు.. నూకలు.. ముక్కవాసన !

రేషన్ దుకాణాల్లో నాసిరకం బియ్యం పంపిణీ

- వండుకునేందుకు పనికిరావంటున్న పేదలు
- మాకొద్దంటూ నిరాకరిస్తున్న లబ్ధిదారులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

మిర్యాలగూడ : ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం నాసిరకంగా ఉంటున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం వండుకునేందుకు వీలు కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ నెలలో చౌకధరల దుకాణాల ద్వారా డీలర్లు పంపిణీ చేస్తున్న బియ్యం ఎర్ర రంగులో ఉండి నూకలు, ముక్క వాసనగా ఉన్నాయని మండిపడుతున్నారు. రేషన్ దుకాణాల్లో అధికంగా ఈ బియ్యమే ఉండడంతో తప్పని పరిస్థితుల్లో లబ్ధిదారులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తీసుకున్న బియ్యం వండుకోలేక, బయట పారేయలేక, ఆ ముద్దలుగా మారుతున్న అన్నాన్నే అతికష్టం మీద మింగి కడుపు నింపుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా రేషన్ దుకాణాదారులకు ఈ బియ్యం సరఫరా అయినట్లు సమాచారం. ప్రధానంగా రేషన్ దుకాణంలో బలవర్థక పోషకాల బియ్యం సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ స్టాక్ ఉందన్న సాకుతో నాన్ ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని 24వ వార్డు రేషన్ దుకాణంలో గురువారం బియ్యం తీసుకున్న లబ్ధిదారుడు అవి నాసిరకంగా ఉన్నాయని గుర్తించి ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.



రంగు మారిన రేషన్ బియ్యం

991 రేషన్ దుకాణాలు

నల్లగొండ జిల్లాలో 991 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. మనిషికి ఆరు కిలోల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఈ నెల జిల్లా వ్యాప్తంగా 5వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అలాట్ చేసింది. జిల్లాల్లోని అన్ని దుకాణాల్లో ఇటీవల బియ్యం సరఫరా ప్రారంభించారు. సూర్యాపేట జిల్లాలోబియ్యం నిల్వలు ఉన్నాయని నాన్ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందించారు. చాలా దుకాణాల్లో నాసిరకం బియ్యం సరఫరా అయినట్లు సమాచారం. కాగా గోదాముల్లో పరిశుభ్రత పాటించకపోవడం, పాత గోనె సంచుల్లో బియ్యం నింపి సరఫరా చేయడం వల్ల ఆ బియ్యంలో రాళ్లు, దుమ్ము, ఇతర వ్యర్థ పదార్థాలు వస్తున్నాయి. పైగా గోనె సంచులకు రంధ్రాలు ఎక్కువగా ఉండడం వల్ల ఎగుమతి, దిగుమతి చేసే సమయంలో బియ్యం నేలపాలవుతుంది. దీంతో ప్రతి రేషన్ దుకాణంలో 5 నుంచి 10 క్వింటాళ్ల బియ్యం తరుగు వస్తుంది. ఆ తరుగు భారం రేషన్ డీలర్‌పై పడుతుంది.

ఎలా వండుకు తినాలి...



మిర్యాలగూడ పట్టణంలోని 24వ రేషన్ దుకాణంలో గురువారం రేషన్ బియ్యం తీసుకున్నా. అన్నం ముక్క వాసన, ముద్దలు ముద్దలుగా ఉంది. ఇదేమి బియ్యం మాకొద్దు అని డీలర్‌ను ప్రశ్నిస్తే సరుకు మొత్తం అలానే వచ్చిందని బదులిచ్చింది.. ముక్క వాసనతో ఉన్న బియ్యాన్ని వండుకుని తినలేకపోతున్నాం. పేదలకు ఇస్తున్న బియ్యం నాణ్యతగా ఉండే విధంగా చూడాలి.

– విజయ్‌కుమార్, మిర్యాలగూడ

వచ్చే నెల అలా జరగకుండా చూస్తాం

సూర్యాపేటలో మిగులు బియ్యం ఉండడం వల్ల ఉన్నతాధికారుల ఆదేశానుసారం అక్కడి నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకున్నాం. బియ్యం నాసిరకంగా ఉన్నట్లు ఫిర్యాదులు అందాయి. నాన్ ఫోర్టిఫైడ్ బియ్యం ఉండడం వల్ల నాసిరకంగా ఉంది. వచ్చే నెల ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తాం. ఎవరికైనా నాసిరకం బియ్యం వస్తే రిప్లేస్‌మెంట్ చేసుకునేందుకు అవకాశం ఉంది. మిర్యాలగూడ గోదాం ఇన్‌చార్జ్‌కి చెప్పి బియ్యం మార్చుకోండి.

– నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లయ్ డీఎం

వాహన తనిఖీలు ముమ్మరం చేయాలి

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

కోదాడరూరల్ : అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఏపీ, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్‌రోడ్ వద్ద గల చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, సేవల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, క్రమశిక్షణతో పనిచేసి పలువురికి ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ స్టేషన్‌ను తనిఖీ చేసి కవాతును పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, ఎస్బీ సీఐ శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ నర్సింహ, కోదాడ రూరల్, టౌన్ సీఐలు పీఎన్‌డీ ప్రసాద్, శివశంకర్, ఎస్‌ఐ సాయిప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.



రామాపురం క్రాస్‌రోడ్ వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్

వింత ఆకారంలో మేకపిల్ల జననం

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామంలో శుక్రవారం వింత ఆకారంలో మేకపిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన మేకల కాపరి తిమ్మిడి లింగయ్యకు 30 మేకలు ఉన్నాయి. అందులో ఒక మేక రెండు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో మగ మేకపిల్ల సాధారణ ఆకారంలో ఉండగా, ఆడ మేకపిల్ల వింత ఆకారంలో ఉంది. గుడ్లగూబను పోలిన కళ్లు, కుక్క ఆకారంలో తల, లేగ దూడ శరీరం పోలి ఉంది. అయితే ఈ పిల్ల జన్మించిన కొద్ది సమయం తర్వాత మరణించింది.



మేకపిల్ల కళేబరం

పామాయిల్ సాగుతో అధిక లాభాలు

- కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత



నడిగూడెం : పామాయిల్ ప్రపంచంలోనే కెల్ల అత్యధిక వంట నూనె దిగుబడి వస్తున్న పంట ఇది. ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు పామాయిల్ తోటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఈ పామాయిల్ తోటల సాగులో అధిక లాభాలు పొందవచ్చని కోదాడ డివిజన్ ఉద్యానశాఖాధికారి అనిత చెబుతున్నారు. ఈ పంటపై ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, సాగు వివరాలు ఆమె మాటల్లోనే..

సాగు చేస్తున్న వంగడం

టెనెరా హైబ్రిడ్ ప్రపంచం మొత్తం మీద పండించే ఏకైక వంగడం. ఇది పలుచని పెంకు మధ్యస్తం నుంచి అధికముగా పీచు భాగము, ఎక్కువగా నూనె శాతం కలిగి ఉంటుంది.

నాటుట : ఏ కాలంలోనైనా మొక్కల్ని నాటవచ్చు. వర్షాకాలంలో జూన్ నుంచి డిసెంబరు మధ్యకాలము అనుకూలమైనది. వేసవి కాలంలో నాటితే ఎండను తట్టుకొనేలా సాగు నీరు అందించాలి. మల్చింగ్ లేదా మొక్క పళ్లాల్లో కవర్ వేయుట మంచిది. 12 నుంచి 14 నెలల వయస్సు కలిగి, 1–1.3 మీటర్ల ఎత్తు, 13 ఆకులతో ఆరోగ్యంగా ఉన్న మొక్కలను నాటాలి. హెక్టారుకు 143 మొక్కలు, ఎకరానికి అయితే 57 మొక్కలు సరిపోతాయి. 60 సెం.మీ పొడవు, వెడల్పు, లోతులో గుంతలు తీసి, 9మీటర్ల ఎడం ఉండేటట్లు త్రిభుజాకారంలో నాటాలి.



నడిగూడెంలో సాగులో ఉన్న పామాయిల్ తోట

నీటి యాజమాన్యం

సీజన్‌ను బట్టి పాదుల్లో తగినంత తేమ ఉండేలా నీరు అందించాలి. నీటి కొరత వలన ఆకుల ఉత్పత్తి తగ్గి, పెరుగుదల సన్నగిల్లి, తదుపరి కాలంలో ఎక్కువ మగ పుష్పాలు వచ్చి దిగుబడి తగ్గిపోతుంది. పాదుల్లో మురుగు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. మూడు సంవత్సరాలు పైబడిన ఆయిల్ పామ్ మొక్కకు వర్షాకాలంలో సుమారు 100–150 లీటర్ల నీటిని ప్రతి రోజు అందించాలి. వేసవిలో ఎండతీవ్రత అధికంగా ఉండి వడగాల్పులు ఉంటే 300 –350 లీటర్ల నీటిని అందించాలి. డ్రిప్ విధానంలో సాగు నీరు అందించడం ఉత్తమమైన పద్ధతి.

పక్వానికి వచ్చిన గెలలు గుర్తించడం ఇలా..

- గెలల్లోని పండ్లు నలుపు నుంచి నారింజ రంగులోనికి మారుతుంది.
- 5–10 పండ్లు గెల నుంచి వాటికవే రాలుతుంటాయి.
- వేళ్లతో పండ్లను గట్టిగా నొక్కినప్పుడు నారింజ రంగు కలిగిన నూనె బయటకు రావడం జరుగుతుంది.

ఎరువుల యాజమాన్యం

మొక్క వయస్సును బట్టి మొదటి సంవత్సరం ఒక్కో చెట్టుకు నత్రజని 870 గ్రాములు లేదా అమ్మోనియం సల్ఫేట్ రెండు వేల గ్రాములు, భాస్వరం సింగిల్ సూపర్ పాస్ఫేట్ రూపంలో 1250 గ్రాములు, పొటాష్ 667 గ్రాములు, బోరాన్ 25 గ్రాములు, రెండవ సంవత్సరం మొక్కలకు నత్రజని 1400 గ్రాములు, భాస్వరం 870 గ్రాములు, పొటాష్ రెండు వేల గ్రాములు, మెగ్నిషియం సల్ఫేట్ 250 గ్రాములు, బోరాన్ 100 గ్రాములు, మూడవ సంవత్సరం మొక్కలకు అయితే నత్రజని 2100 గ్రాములు, భాస్వరం 1305 గ్రాములు, పొటాష్ రెండు వేల గ్రాములు, మెగ్నిషియం సల్ఫేట్ 500 గ్రాములు, బోరాన్ 100 గ్రాములు మొక్కల పాదులో వేయాలి. మూడవ సంవత్సరంలో సిఫారసు చేసిన ఎరువులను నాలుగో సంవత్సరం కూడా వేయలసి ఉంటుంది. రెండవ దఫా ఎరువులతో పాటు 50 నుంచి 100 గ్రాముల పశువుల ఎరువులు లేదా 100 కిలోల పచ్చిరొట్ట ఎరువు, 5 కిలోల వేప పిండి వేసుకోవాలి.

గెలల దిగుబడి

గెలల దిగుబడి నాలుగో సంవత్సరం నుంచి ప్రారంభం అవుతుంది. కానీ దిగుబడి నిలకడగా రావడం ఏడవ సంవత్సరం నుంచి ప్రారంభమవుతుంది. ఎకరానికి సగటున 10–12 టన్నుల తాజా గెలల దిగుబడి వస్తుంది.

గెలలు కోయు విధానం

పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే కోయాలి. పచ్చి గెలలను కోసిన యెడల నూనె శాతం తగ్గి వ్యర్థ పదార్థాలు ఎక్కువగా వస్తాయి. గెలలు కోసేటప్పుడు కాడపొడవు 5 సెం.మీ. కన్నా తక్కువగా ఉండాలి. పూర్తిగా ఎదిగిన చెట్టు ఎత్తు దాదాపు 15–18 మీటర్ల వరకు ఉంటుంది. నాటిన 4 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది.

ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ

పామాయిల్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీ సౌకర్యం కల్పించింది. ఒక ఆయిల్ పామ్ మొక్క రూ.20 లభిస్తుంది. అంతర పంటల సాగు కోసం, ఎరువుల నిమిత్తం ఎకరానికి రూ.4,200ల చొప్పున 4 సంవత్సరాల వరకు మొత్తం రూ.16,800లు నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తుంది. బిందు సేద్య పథకం ద్వారా అర్హులైన రైతులకు 80శాతం నుంచి 100శాతం రాయితీపై విలువైన బిందు సేద్య పరికరాలు అందించబడుతుంది. నర్సరీ నుంచి రైతు వ్యవసాయ క్షేత్రం వరకు మొక్కల రవాణా, దిగుమతి రైతులు ఏర్పాటు చేసుకోవాలి.